క్లుప్తంగా

రైతులకు పరామర్శ


రైతులతో మాట్లాడుతున్న వెంకటయ్య

దుబ్బాకరూరల్: పొలం పనులకు వెళ్లి వరద ఉధృతిలో చిక్కుకు పోవడంతో రెస్క్యూ టీమ్ రక్షించిన రైతులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. అక్బర్‌పేటభూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన రైతులు శేర్ల రాజు, శేర్ల గోపాల్, చింతల సుదర్శన్‌ను శనివారం ఆయన కలిసి మాట్లాడారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సతీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, మండల అధ్యక్షుడు రవి, రాజయ్య, మల్లేశం తదితరులు ఉన్నారు.

నేడు 'కూడలి' ఆవిష్కరణ సభ


కరపత్రం ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక శివానుభవ మండపంలో ఆదివారం 'కూడలి' కవితా సంకలన ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వంగర నరసింహారెడ్డి, పర్కపెల్లి యాదగిరి తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం వారు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీఊహ రచించిన 'బల్కావ్ ' కథా సంపుటికి వెన్నెల సాహితీ పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. కవులు జూకంటి జగన్నాథం, కొండిమల్లారెడ్డి, మహమూద్ పాషా, ఉప్పలపద్మ తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు.

శిక్షణతో గీతకార్మికులకు ఉపాధి: ఎక్సైజ్ సీఐ


బాలాగౌడ్‌తో ఎక్సైజ్ సీఐ నర్సింహులు

కొండపాక(గజ్వేల్): కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం శిక్షణ ఎంతో దోహదపడుతుందని చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులు అన్నారు. కుకునూరుపల్లిలో కల్లుగీత కార్మికుడు బాలగౌడ్ నిర్వహిస్తున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గీత కార్మికుల జీవనోపాధి కోసం బాలగౌడ్ ఇస్తున్న శిక్షణ అభినందనీయం అన్నారు. చెట్లు ఎక్కడం, కల్లుగీయడంలో శిక్షణ పొందిన కార్మికులకు సొసైటీలో సభ్యత్వం కల్పింస్తారని, అలాగే ప్రభుత్వం అందించే పథకాలు పొందవచ్చని చెప్పారు. ఎక్సైజ్ ఎస్ఐ సువర్ణ, కానిస్టేబుళ్లు, గీత కార్మికులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం


అధికారులను సన్మానించిన రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డి మాజీ సర్పంచ్ చిలువేరి రాంరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అధికారులను సన్మానించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి గ్రామ శివారులోని తుంగచెరువుకు గండిపడింది. సమాచారం అందుకున్న సీఐ లతీఫ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ రవికాంత్‌రావు చెరువు వద్దకు చేరకుని గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. గంటల వ్యవధిలోనే గండిని పూడ్చి ప్రమాదాన్ని నివారించారు. దీంతో వారికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. తాము ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటామని అధికారులు అన్నారు. భూపాల్‌రెడ్డి, సత్యంగౌడ్, కిష్టాగౌడ్, రవి పాల్గొన్నారు.

పౌష్టికాహారమే లక్ష్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ జనార్దన్ అన్నారు. చిన్నకోడూరులో బీసీ, ఎస్సీ వసతి గృహాలను శనివారం ఆయన సందర్శించారు. వసతి గృహాల ఆవరణల్లో ఆకుకూరలు, కూరగాయల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఉన్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమిరెడ్డి, ఏపీఓ స్రవంతి, ఈసీ రమేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటఎడ్యుకేషన్/దుబ్బాక: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ భిక్షపతి, ప్రొఫెసర్ అనిత అబ్రహం, డాక్టర్ సునీత, భవాని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 2వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని, 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

- గ్రామాల్లో నామ మాత్రంగా చెత్త సేకరణ
- కానరాని కంపోస్టు తయారీ


నిరుపయోగంగా మారిన నాగపురి డంపింగ్ యార్డు

చేర్యాల(సిద్దిపేట): గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. చెత్తను గ్రామ శివార్లలో పడవేసి కాలుస్తున్నారు. దీంతో ఎరువుల తయారీ, ఆదాయం మాట అటుంచితే వాతావరణం కాలుష్యం ఏర్పడి ప్రజలు రోగాల భారినపడుతున్నారు.

నిర్వహణ లేక నిరుపయోగం

మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ నిధులతో డంపింగ్, వర్మికంపోస్టు షెడ్లు నిర్మించారు. వాటిని కంపోస్టు తయారీకి వినియోగించాల్సి ఉంది. కానీ నిర్వహణలేక నిరుపయోగంగా మారాయి.

అవగాహన కరువు

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అప్పట్లో పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. మొదట్లో కొన్నిరోజుల పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించినా కొన్ని రోజుల తర్వాత ప్రజలు దానిని పాటించడం మానేశారు. పంచాయతీ కార్మికులు సైతం సేకరించడం ప్రారంభించారు. దీంతో చెత్తను వేరు చేయడం కష్టంగా మారింది. కార్యదర్శులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.


తాడూరులో బయట పారబోసిన చెత్త

ఖాళీ స్థలాల్లోనే..

తడి, పొడి చెత్త వేరుచేయడంపై అవగాహన కల్పించకపోవడంతో మండల పరిధిలోని 18 గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరువేరుగా అందించడం లేదు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డు, కంపోస్టు యార్డుకు తరలించడంలేదు. గ్రామాల శివారుల్లోని ఖాళీ ప్రదేశాలు, పాడుపడ్డ బావులు, చెరువులు, కుంటలు, వాగుల్లో డంపుచేసి కాలుస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



వర్షాకాలం దృష్ట్యా తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించడానికి కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామాల్లో ట్రాక్టర్ల నిర్వహణకు నిధులులేవు. దీంతో ప్రతి రోజూ చెత్త సేకరణ చేయలేకపోతున్నాం. అయినా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– డా.చిలుముల శ్రీనివాస్, ఎంపీడీఓ, చేర్యాల

ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర

హుస్నాబాద్‌లో బంజారాల నిరసన


తెల్లం వెంకట్రావు, సోయం బాపురావు చిత్రపటాలను చెప్పలతో కొడుతున్న గిరిజనులు

హుస్నాబాద్: బంజారా, లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని నిరసిస్తూ హుస్నాబాద్‌లో గిరిజనులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. పిటిషన్ వేసిన కాంగ్రెస్ నాయకులు తెల్లం వెంకట్రావ్, సోయం బాపురావుల ఫ్లెక్సీని చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశాన్ని పాలించిన చరిత్ర బంజారాలకు ఉందన్నారు. తమ పోరాట ఫలితంగానే 1976లో ఎస్టీ జాబితాలో చేర్చారని చెప్పారు. బంజారాలు గుట్టల్లో, అడవుల్లో జీవనం కొనసాగిస్తారనే విషయాన్ని కోయ జాతికి చెందిన సోయం బాపురావు, తెల్లం వెంకట్రావులు గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకొని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బీలు నాయక్, గిరిజన నాయకులు భూక్య శ్రీనివాస్, సంపత్ నాయక్, లక్ష్మణ్ నాయక్, కిషన్ నాయక్, కైలు నాయక్, రాములు నాయక్, తిరుపతి నాయక్, సరోజన పాల్గొన్నారు.

అంబాని, అదానీలకే అటవీ సంపద



గజ్వేల్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

- శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలి
- యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశ అటవీ సంపదను అంబానీ, అదానీలకు పంచిపెడుతూ, అక్కడ నివసిసించే గిరిజనులను మావోయిస్టుల పేరుతో దారుణ హింసాకాండకు పాల్పడుతోందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్ఐ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ జిల్లా ప్రథమ మహాసభలను గజ్వేల్‌లోని కోలా అభిరాం గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీర్యాలీ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో గైడ్ మాడిశెట్టి అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐకేఎస్ రైతు సంఘం జాతీయ కార్యదర్శి చందర్‌రావు మాట్లాడారు. బట్టీ చదువులకు స్వస్తి పలికి, శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా మంత్రులంతా విదేశీ పర్యటనలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం వల్ల సిద్దిపేట స్టడీ హబ్‌గా మారే అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో వెంకట్, శేఖర్, హేమంత్, వసంత్, వినయ్, మహేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: నియోజకవర్గ పరిధిలో 29 అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.2.32 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూంపల్లి–అక్బర్‌పేట మండలంలోని జంగపల్లి, వీరారెడ్డిపల్లి, అక్బర్‌పేట, చిన్న నిజాంపేట, తాళ్లపల్లి, మిరుదొడ్డి మండలంలోని అందె, అల్వాల, కాసులాబాద్, మిరుదొడ్డి, దౌల్తాబాద్ మండలంలోని అప్పాయిపల్లి, లింగాయిపల్లి తాండ, పోసానిపల్లి, తిర్మలాపూర్, శేరిల్ల, తొగుట మండలంలోని చందాపూర్, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి,తుక్కాపూర్, రాంపూర్, రాయపోల్ మండలంలోని రాయపోల్, తిమ్మక్కపల్లి, మంతూర్, ఎల్కల్, దుబ్బాక మండలంలోని ఆరపల్లి, గంభీర్‌పూర్, వెంకటగిరి తాండ, టేకులతాండ, ఆకారం గ్రామాల్లో నూతనంగా అంగన్‌వాడీ భవనాలు నిర్మించేందుకు ఈ నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల ఉచిత నిర్ధారణ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ, సమగ్రశిక్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు 18 యేళ్లలోపు దివ్యాంగుల ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు దివ్యాంగ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు. నిర్ధారణ అనంతరం రెండు నెలల్లో ఉచితంగా ఉపకరణాలు అందజేస్తారని చెప్పారు. సెప్టెంబర్ 1న హుస్నాబాద్ పెన్షనర్ భవన్‌లోను, 2న ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, 3న అనగా సిద్దిపేట టీటీసీ భవన్‌లోను శిబిరాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించండి


మాట్లాడుతున్న దేవి రవీందర్

కొండపాక(గజ్వేల్): ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్ కోరారు. కుకునూరుపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. ఎకరాకు రూ.25 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మహిపాల్, కిరణ్‌కుమార్‌చారి, నాయకులు సంతోష్‌రెడ్డి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా సల్మాన్


సల్మాన్ హుస్సేన్

వర్గల్(గజ్వేల్): జిల్లా యూత్‌కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా వర్గల్ మండలం తున్కిఖాల్సాకు చెందిన సల్మాన్‌హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సల్మాన్ చెప్పారు.

యంత్రాంగం అప్రమత్తం

- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించాలి
- కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ మంజుల


పదవీ విరమణ పొందిన సిబ్బందికి కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మానం

సిద్దిపేటజోన్: వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ మంజుల సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా వార్డుల్లో సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. వరదలకు రహదారులు, నాళాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయించాలని కోరారు. అనంతరం మంజుల మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి, ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ ఒకేరోజు జరగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువుల. కుంటల వద్ద నిమజ్జనం కోసం ఏర్పాట్లు వేగవంతం చేయాలని, విద్యుత్ సరఫరా, రహదారి నిర్మాణం సరిగ్గా ఉండేలా చూడాలని సూచించారు. పదవీవిరమణ చేసిన మున్సిపల్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు సుందర్, అరవింద్‌రెడ్డి, ప్రవీణ్, సాయి కుమార్, విఠోభ, రవి, నాగరాజు రెడ్డి, మల్లికార్జున్, బ్రహ్మం పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుచేసే వరకు పోరాటం ఆగదు

పీఆర్‌టీయూ నేతలు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ


బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

గజ్వేల్: సీపీఎస్ విధానం రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ అన్నారు. పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ శనివారం గజ్వేల్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఉద్యమిస్తేనే సీపీఎస్ రద్దవుతుందన్నారు. సీపీఎస్‌పై ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా యోగా పోటీలు


సర్టిఫికెట్లు చూపుతున్న క్రీడాకారులు

సిద్దిపేటజోన్: స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఆరో యోగాసన చాంపియన్ షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నిర్మల్‌లో సెప్టెంబరు 5 నుంచి 7 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, యోగా గురువు సతీశ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు అంజయ్య, సంధ్య, రజని, పూజ, రాధిక, సురేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య సేవలు అభినందనీయం

జెడ్పీ సీఈఓ రమేశ్


బాలయ్య దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ

దుబ్బాకటౌన్: ఎంపీడీఓగా బాలయ్య చేసిన సేవలు మరువలేనివని జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి బి.దేవకీదేవి ప్రశంసించారు. రాయపోల్ ఎంపీడీఓగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన బాలయ్యకు శనివారం రాయపోల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు అందించిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ప్రభుత్వం అమలు చేసే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేసి ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి బాలయ్య అని కొనియాడారు. టైపిస్టుగా ప్రారంభమైన ఆయన ఎంపీడీఓగా ఎదిగడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ బాబునాయక్, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ నరేశ్, వైద్యాధికారి మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కమలాయపల్లి మహిళలు

చేర్యాల(సిద్దిపేట): తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని కమలాయపల్లిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి పట్టించుకోక పోగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చేర్యాల ఎంపీడీఓ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని ఇంచార్జి కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో మహిళలునిరసన విరమించారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ జాన్ వెస్లీ అరెస్టు అప్రజాస్వామికం

సిద్దిపేటఅర్బన్: పేదల భూములపై హక్కులు కల్పించాలని పోరాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రామోజీ ఫిలింసిటీ పక్కన గల అనాజీపూర్ భూములను అక్రమంగా రామోజీ ఫిలిం సిటీకి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ నెల రోజులుగా ఆందోళన జరుగుతున్న విషయం తెలిసిందే. జాన్‌వెస్లీ అసెంబ్లీకి వెళ్తారనే కారణంతో అరెస్టు చేయడమే ప్రజా పాలనా? అని ప్రశ్నించారు.

◆ పొలాల్లో నీరు నిలిచిపోవద్దు

కొండపాక(గజ్వేల్): ఆరుతడి పంటల్లో నీరు నిలిచిపోకుండా చూసుకోవాలని తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పల్లవి, రమాదేవి తెలిపారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలోని పత్తి, మొక్కజొన్న కంది, వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణితో కలిసి శనివారం పరిశీలించారు. చీడపీడల నివారణ కోసం రైతులకు సూచనలిచ్చారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఓ శివరామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, ఏఈఓలు రయ్య, ప్రనూష, మౌనిక, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

◆ సస్యరక్షణతో రైతులకు మేలు

దుబ్బాకటౌన్: నీట మునిగిన పంటలను రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నీట మునిగిన పంటలను కాపాడుకునేందుకు రైతులకు అవగాహన కల్పించారు. పొలాల నుంచి నీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

◆ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో సిటీ యాక్ట్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా బెజ్జంకిలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించవద్దని ఎస్ఐ సౌజన్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ విధుల్లోకి తీసుకోవాలని వినతి

సిద్దిపేటరూరల్: జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో డెంగీ కారణంగా ఇద్దరు చనిపోయిన నేపథ్యంలో సస్పెండైన పంచాయతీ కార్యదర్శి జి.శైలేశ్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు శనివారం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా నిధులు లేకున్నా విధులు నిర్వహిస్తున్న తమపై ఇలాంటి చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.

◆ మద్యం అమ్మకాలపై చర్యలేవి?

సిద్దిపేటకమాన్: గడువు ముగిసిన మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సిటిజన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధి శివచంద్రం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ గడువు ముగిసిన బీరు తాగిన ఓ యువకుడు అస్వస్థతకు గురయ్యాడని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ తప్పిదాలను సవరించండి

బెజ్జంకి(సిద్దిపేట): ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించాలని బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితాపై ఎంపీడీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఒకే కుటుంబంలోని వ్యక్తులందరినీ ఒకే వార్డులో ఉంచాలన్నారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, వేణు, శ్రీనివాస్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ 'స్థానిక' ఎన్నికలకు సహకరించాలి

చేర్యాల(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేశామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే 30 శనివారం సాయంత్రంలోపు తెలియజేయాలన్నారు. నాయకులు మల్లేశం, సురేశ్, అశోక్, వెంకట్‌మావో, రాజు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ సొంత నిధులతో పారిశుద్ధ్య పనులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో గ్రామస్తులు సొంత నిధులతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డెంగీతో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే.

◆ హక్కులకు భంగం కలిగించొద్దు

ములుగు(గజ్వేల్): హక్కులకు భంగం కలిగించకుండా సమాజ హితానికి అందరూ కృషి చేయాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తున్కిబొల్లారంలో శనివారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, నాయకులు ఏకాంబర్‌రెడ్డి, వీరారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.